భయపెడుతున్న స్పీడ్ బ్రేకర్లు



శ్రీహరిపురం కొత్త రామాలయం వీధిలో స్పీడ్ బ్రేకర్



శ్రీహరిపురం గణేష్ మందిరం లైన్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్

మల్కాపురం : నిబంధనలకు విరుద్ధంగా... ఎవరికి నచ్చినట్టు వారు వీధుల్లోని తమ ఇళ్ల ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకుంటుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం పరిధి కొత్త రామాలయం వీధి, గణేష్ మందిరం వీధి, జీవీఎంసీ పాఠశాల లైన్, జవహర్‌నగర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కొంత మంది తమ ఇళ్ల ముందు అనధికారికంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకున్నారు. వాస్తవానికి స్కూల్ జోన్ ప్రాంతాల్లో, రెండు లేదా నాలుగు లైన్ల రోడ్డు ఉండే జంక్షన్ పాయింట్ల వద్ద, దేవాలయాలు, పాదచారులు రోడ్డు దాటేందుకు ఉద్దేశించిన ప్రాంతాలకు సమీపంలో ఆ మార్గంలో వాహనాలు వేగంగా రాకుండా నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తారు. అది కూడా ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో ఏయే ప్రాంతాల్లో ఏ పరిమాణంలో నిర్మించాలో నిర్ణయిస్తారు. వాటిపై తెలుపు, నలుపు రంగులు వేయడంతోపాటు రేడియం స్టిక్కర్లు కూడా అతికిస్తారు. అందువల్ల అవి ప్రమాదాల నియంత్రణకు దోహదపడతాయి. అందుకు భిన్నంగా కొంత మంది అనుమతులు తీసుకోకుండా ఇళ్ల ముందు ఇష్టారాజ్యంగా వీటిని ఏర్పాటు చేసేసుకుంటున్నారు. ఒక పద్ధతి ప్రకారం కాకుండా ఎత్తైన కొండల మాదిరిగా, ఎగుడుదిగుడుగా వీటిని ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్కోసారి వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. ముఖ్యంగా బ్రేకర్ల మీద రంగులు, రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయడం లేదు. దీంతో వాహనదారులు ఆ భారీ స్పీడ్ బ్రేకర్లను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. గత వారం కొత్త రామాలయం వీధిలో ఓ వ్యక్తి తన తల్లిని ఓ ఆస్పత్రికి వైద్యం కోసం తీసుకెళ్తూ స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపు తప్పడంతో పడిపోయారు. ఈ ఘటనలో ఇద్దరూ గాయాలపాలయ్యారు. ఇలాంటి ఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతూనే ఉంటున్నాయి. జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



శ్రీహరిపురం కొత్త రామాలయం వీధిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. రాత్రి సమయంలో ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలపై వస్తున్నప్పుడు గుర్తించ లేక అదుపు తప్పుతున్నాం. అనధికారికంగా స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు వేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బంక నాగేశ్వరరావు, కొత్త రామాలయం వీధి

బైక్‌లతో అదుపు తప్పుతున్నాం



శ్రీహరిపురం గణేష్ మందిరం వీధి వద్ద, జీవీఎంసీ పాఠశాల వద్ద, జవహర్‌నగర్ సేవా మార్గంలో స్పీడ్ బ్రేకర్లు కొండలను తలపించేలా ఉన్నాయి. వీటి వల్ల ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి చాలా మంది గాయాల పాలవుతున్నారు. గత వారం నేను ఆ మార్గంలో వస్తూ అదుపు తప్పి పడిపోయాను. అనధికారికంగా ఏర్పాటు వేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నూకరాజు, గణేష్ మందిరం వీధి

క్లుప్తంగా

షబ్నమ్‌ను సత్కరించిన డిప్యూటీ మేయర్ శ్రీధర్



షబ్నమ్‌ను సత్కరిస్తున్న జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య : మలేషియాలో నిర్వహించే అంతర్జాతీయ అండర్ – 19 క్రికెట్ వరల్డ్ కప్ టోర్నీకి వరుసగా రెండోసారి ఎంపికైన షబ్నమ్ షకీల్‌ను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం సత్కరించారు. జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లోని తన నివాసానికి వచ్చిన క్రికెటర్ షబ్నమ్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అండర్ – 19 మహిళల ప్రపంచకప్ విజేతగా దేశాన్ని నిలపాలని, నగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

వేడుకగా నగర సంకీర్తన



వేంకటేశ్వర స్వామి పల్లకీ సేవలో భక్తులు

మల్కాపురం : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెం ప్రాంతానికి చెందిన వాసుదేవ అన్నమ్మయ్య పద సంకీర్తన సంస్థ సభ్యులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రోజూ వేకువజామున స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో పురవీధుల్లో ఊరేగిస్తూ భజనలు, కీర్తనలు ఆలపిస్తూ నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు మల్కాపురం, పల్లివీధి, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో స్వామిని పల్లకీలో ఊరేగిస్తూ నగర సంకీర్తన చేశారు. కన్నుల పండువగా సాగిన నగర సంకీర్తనలో నీలాతి గుణవతి, తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి



గుల్లలపాలెం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం : భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే జాతికి క్షమాపణలు చెప్పాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీపీఎం మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ జీవీఎంసీ 59వ వార్డు గుల్లలపాలెం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యత గల పదవిలో ఉండి అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బి.రాంబాబు, ధనాల రాము, సూరిబాబు, తిరుపతిరావు, గొల్ల బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్, తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతుల పేటలో జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఈఈ తారా ప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ రాజశేఖర్ గురువారం కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. రామ్మూర్తి పంతులపేట నుంచి గవర కంచరపాలెం వెళ్లే మార్గంలో సుమారు రూ.19 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టినట్లు ఏఈ ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాటాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం



డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తోన్న ఆల్ఫా కృష్ణ

విశాఖ విద్య : ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధం కావాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ అన్నారు. నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలపై వారిరువురు చర్చించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాల మేరకు పార్టీని మరింత పటిష్టం చేసేలా భవిష్యత్‌లో కార్యక్రమాల రూపకల్పన చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులను సమాయత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త సంవత్సరంలో పార్టీని మరింత బలోపేతం చేసేలా, క్యాడర్‌లో నూతనోత్తేజం నింపాలన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు



రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్న, తదితరులు

సింధియా : జీవీఎంసీ 63వ వార్డు పరిధిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మాణ పనులను కార్పొరేటర్ గల్లా చిన్న గురువారం దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రహదారులు సరిగ్గా లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు ఫిర్యాదు చేయడంతో సుమారు రూ.20 లక్షలు మంజూరు చేయడంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, బాబూరావు, నరేస్, చిట్టిబాబు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ పురుషుల హాకీ జట్టు ఎంపిక

విశాఖ విద్య: ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ పురుషుల హాకీ జట్టు ఎంపిక గురువారం జరిగింది. మద్రాస్ యూనివర్సిటీలో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు, కోచ్‌లకు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు డీఏను పెంచి సహకారం అందించారన్నారు. జట్టు కోచ్ రాంబాబు, మేనేజర్, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ దుర్గారావు, డాక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల సహకారంతోనే ప్లాస్టిక్ నియంత్రణ



మార్కెట్‌లో వ్యాపారులకు అవగాహన కలిగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా : జనవరి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించారని, ఇందుకు వ్యాపారులు కూడా స్వచ్ఛందంగా సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కోరారు. ఈ మేరకు గురువారం జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డ్‌కాలనీలో ఉన్న వెజిటబుల్ మార్కెట్‌లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనంతరం వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వినియోగదారులు అడిగినప్పటికీ ప్లాస్టిక్ కవర్లు ఇవ్వరాదని, వాటిని వినియోగించడం చట్టవిరుద్ధమని వినియోగదారులకు అవగాహన కలిగించాలన్నారు. కాలుష్యం కోరల్లో చిక్కుకున్న విశాఖను స్వచ్ఛ విశాఖగా మార్చడమే లక్ష్యంగా వ్యాపారులు, వినియోగదారులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిర్మూలనలో పాలుపంచుకోవాలని కోరారు. ప్లాస్టిక్ బ్యాగులు, పాలిథిన్ కవర్లు వినియోగించినా, విక్రయించినా చర్యలు తీసుకోవడంతోపాటు అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎం నాయుడు, తంబయ్య, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యాదవ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏజీఎం సదాశివరావు, తదితరులు

మల్కాపురం : హిందుస్థాన్ షిప్‌యార్డ్ యాదవ ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్ గురువారం ఆవిష్కరించారు. సంస్థ ఆవరణలో యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏజీఎం సదాశివరావు యాదవ్ పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం ప్రతినిధులు తమ సభ్యుల సంక్షేమానికి, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉరుకూటి మురళీయాదవ్, ప్రధాన కార్యదర్శి జోగ రాజుయాదవ్, కోశాధికారి చొప్ప చిరంజీవి, సభ్యులు ఉరుకూటి సింహాచలం, ఏదుర శ్రీనువాసరావు, మొల్లి అప్పలరాజు, మాడిస శ్రీనివాస్‌రావు, కొన నర్సింగ్‌రావు, అమ్మోరు, కనకరాజు, నమ్మి వెంకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్‌తో ట్రాఫిక్ ఇబ్బందులు



గోపాలపట్నం రోడ్డుపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలు



గోపాలపట్నం ప్రధాన రహదారిలో పార్కింగ్ చేసిన వాహనానికి లాక్ వేస్తున్న కానిస్టేబుల్ (పాత చిత్రం)

- గోపాలపట్నం, కంచరపాలెం మార్గాల్లో వేలాది మందికి అవస్థలు
- ట్రాఫిక్ పోలీసుల చర్యలు శూన్యం

గోపాలపట్నం : కొంత మంది బాధ్యతారాహిత్యం వేలాది మంది వాహనదారులకు శాపంగా మారుతోంది. నిత్యం రద్దీగా ఉండే రహదారులపై ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేసేస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ప్రజల కష్టాలు తెలుసుకున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసులు రాంగ్ పార్కింగ్‌పై కొద్ది రోజుల కిందట స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా గోపాలపట్నం నుంచి కంచరపాలెం వరకు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలకు లాక్‌లు వేశారు. వాహనదారులకు అపరాధ రుసుము విధించారు. అయితే ఇలా వారం రోజులపాటు హడావిడి చేసిన తర్వాత వదిలేయడంతో ప్రస్తుతం పరిస్థితి మళ్లీ మామూలుగా మారిపోయింది. కొద్ది రోజులుగా పండగల సమయం కావడంతో ప్రధాన రహదారుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు ఇష్టారీతిగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు అధికమయ్యాయి. కీలకమైన గోపాలపట్నం, కంచరపాలెం మార్గాల్లో రాకపోకలు సాగించే వేలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు... ఇలా అందరూ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు దుకాణాలకు షెల్లార్ పార్కింగ్ లేకపోవడం, కొన్నింటికి ఉన్నప్పటికీ సొంత అవసరాలకు వాడుకోవడం మరింత ఇబ్బందికరంగా మారుతోంది. టాఫిక్ పోలీసులు స్పందించి ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా దుకాణదారులు షెల్లార్లలో పార్కింగ్‌కు అవకాశం కల్పించేలా జీవీఎంసీ అధికారులతో కలిసి చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్య పరిష్కరించాని కోరుతున్నారు.

డంపింగ్ యార్డ్ కాదు.. సేవా మార్గమే..!



మల్కాపురం గొల్ల వీధి వద్ద సేవా మార్గంలో పేరుకుపోయిన వ్యర్థాల వద్ద ఆవు

మల్కాపురం : ఆ సేవా మార్గంలో నడవాలంటే ఎలాంటి వారైనా ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. ఆ మార్గమంతా వ్యర్థాలు, పశువులతో నిండిపోవడమే ఇందుకు కారణం. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం నుంచి రెడ్డి వీధి వరకు వెళ్లే సేవా మార్గంలో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలనీ వాసులు నిర్లక్ష్యంగా చెత్త, వ్యర్థాలు డంప్ చేసేస్తున్నారు. వాటిని సకాలంలో పారిశుధ్య కార్మికులు తొలగించకపోవడంతో ఆవులు, ఇతర పశువులు అక్కడకు చేరి చిందరవందరగా చేసేస్తున్నాయి. ఇక్కడి పరిస్థితిని చూసే వారెవరైనా డంపింగ్‌యార్డు అనేలా ఉంటోంది. ఇష్టారాజ్యంగా వ్యర్థాలు డంప్ చేస్తున్న వారికి శానిటరీ అధికారులు జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఉన్నతాధికారులు కూడా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఉక్కు కార్మికుల ఆగ్రహం



దీక్షా శిబిరంలో పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి : విశాఖ ఉక్కు పరిరక్షణ విషయంలో కూటమి నాయకులు హామీలివ్వడం తప్ప కార్మికులకు మేలు జరగలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో 1,421 రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పట్టుబడతారని ఆశించామని, అయితే ఒరిగిందేమీ లేదన్నారు. విశాఖ ఉక్కు, వాటి అనుబంధ సంస్థల్లో లక్షల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. పరిరక్షణ మాటెలా ఉన్నా కనీసం జీతాలు చెల్లించకపోవడంతో కార్మికుల ఇళ్లు గడవడం కూడా కష్టంగా మారిందన్నారు. ఆరు మాసాల నుంచి జీతాల సమస్య ఉన్నా నాయకులకు ఏమీ తెలియదన్నట్టు నటిస్తున్నారని మండిపడ్డారు. బీఐఎఫ్ఆర్ ముంగిటకు స్టీల్‌ప్లాంట్ వెళ్లిన సందర్భాల్లో కూడా జీతాలు ఒక్క నెల కూడా ఆపలేదని, ఈ దుస్థితికి ప్రభుత్వాలు అనుసరించే విధానాలు, కొంతమంది ఉన్నతాధికారులు నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగమే కారణమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించి వెంటనే సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీహెచ్.వెంకటేశ్వరరావు, పి.పరంధామయ్య, యు.వెంకటేశ్వరరావు, పోలిపల్లి లక్కరాజు, కొప్పుల జగన్నాథరావు, రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషితోనే పాఠశాలల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో త్రినాథ్

మల్కాపురం : ఉపాధ్యాయుల కృషితోనే మంచి ఫలితాలు వస్తాయని, పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ములగాడ విద్యాశాఖాధికారి త్రినాథ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు జీవీఎంసీ 58వ వార్డు ప్రాథమిక పాఠశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ చక్కగా బోధిస్తే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ఎస్.ప్రకాష్‌రావు, టి.రామారావు, స్వాతిలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

8 కిలోల పాలిథిన్ కవర్లు స్వాధీనం



రైతుబజార్‌లో తనిఖీలు చేస్తున్న ఏఎంహెచ్‌వో దుర్గాప్రసాద్

సీతమ్మధార : ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా జీవీఎంసీ జోన్ – 3 ప్రజారోగ్యశాఖ అధికారులు దాడులు చేసి వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా 23వ వార్డు పరిధిలో గల సీతమ్మధార రైతుబజార్‌లోని పలు స్టాళ్లలో అధికారులు దాడులు చేసి వ్యాపారులు, రైతులకు ఆదేశాలు జారీ చేశారు. జోన్ – 3 సహాయ వైద్యాధికారి దుర్గా ప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ పలు స్టాళ్లలో తనిఖీలు నిర్వహించి 8 కిలోల పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పక్కనే ఉన్న జీవీఎంసీ హాకర్స్ జోన్‌లో గల చేపలు, కూరగాయల స్టాళ్లను అధికారులు తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయం పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌ల ఆశయాలు నెరవేర్చాలి

మురళీనగర్ : వాకర్స్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆశయాలు వాకర్స్ ఇంటర్నేషన్ డిస్ట్రిక్ట్ – 101 నెరవేర్చాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం సూచించారు. మురళీనగర్‌లోని బ్యాంక్ స్ట్రీట్‌లో వాకర్స్ జిల్లా 101 గవర్నర్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం నూతన గవర్నర్‌గా ఎంపికైన కె.ద్వారకానాథ్ ఈ ఏడాది నిర్వహించాల్సిన కార్యక్రమాల ప్రణాళిక ప్రకటించారు. అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ – 2025 సంవత్సరం డైరెక్టరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌సీ – 5 యు.శుభ, పూర్వ గవర్నర్లు టి.రంగారావు, జి.సూర్యనారాయణ, ఎ.లక్ష్మిరెడ్డి, కేబినెట్ కార్యదర్శి ఆర్‌ఆర్ఎస్ మహేష్, కోశాధికారి డి.లక్ష్మణరావు, డి.శిరీష, సీహెచ్ జ్యోతి, పల్లా చంద్రమౌళి పాల్గొన్నారు.